విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా వెలువడుతున్న
మెదక్‌టుడే దినపత్రికలో విలేకరులుగా పనిచేయుటకు
బ్యూరో, మండలలా , జిల్లాల, నియోజకవర్గ స్థాయుల్లో
ఉత్సహవంతులైన యువతి,యువకులు కావలెను.
కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి
అవకాశం ఇవ్వబడును.

RNI NO,TELTEL/2023/88524
మెదక్ టుడే
తెలుగు దినపత్రిక MEDAK TODAY

Call us now! 9494117870



RNI NO : TELTEL/2023/88524

# మెదక్ టుడే


MEDAK TODAY తెలుగు దిన పత్రిక...

సోమవారం, ఆగష్టు 11 2025 | మెదక్ | పేజీలు :4 | వెల రూ.:2 | ఎడిటర్: సిహెచ్. శివకుమార్ | సంపుటి 02 | సంచిక 297


## మేక్ ఇన్ ఇండియా'తో

## భారతదేశ శక్తిని ప్రపంచానికి పరిచయం చేశాం: ప్రధాని మోదీ

**న్యూ ఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'ఆపరేషన్ సిందూర్' గురించి ప్రస్తావిస్తూ, ప్రపంచం మొత్తం ఈ కొత్త భారతదేశ రూపాన్ని చూసిందని అన్నారు. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత తొలిసారి బెంగళూరు చేరుకున్న ప్రధాని మోదీ, మెట్రో ఎల్లో లైన్‌ను ప్రారంభించారు. అలాగే మూడవ దశకు శంకుస్థాపన చేశారు. 'ఆపరేషన్ సిందూర్' విజయం అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, భారత్ శక్తి, 'మేక్ ఇన్ ఇండియా' చొరవపై ఆధారపడి ఉందని, ఇందులో బెంగళూరు, కర్ణాటక యువత ముఖ్యమైన పాత్ర పోషించారని ప్రధాని మోదీ అన్నారు."ఆపరేషన్ సింధూర్" విజయానికి ప్రధాన కారణం మన సాంకేతికత, రక్షణ పరంగా మేక్ ఇన్ ఇండియా శక్తి అని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. కర్ణాటక యువత దీనికి ఎంతో దోహదపడ్డారన్నారు. ముఖ్యంగా బెంగళూరులోని ప్రతి ఒక్కరినీ అభినందిస్తున్నాను అని ప్రధాని మోదీ అన్నారు.



ఆపరేషన్ సిందూర్‌లో భారత దళాల విజయాన్ని, సరిహద్దు వెంబడి అనేక కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉగ్రవాద స్థావరాలను నాశనం చేశామన్నారు. మన సామర్థ్యాన్ని, ఉగ్రవాదులను రక్షించడానికి వచ్చిన పాకిస్తాన్‌ను కొన్ని గంటల్లోనే మోకరిల్లేలా చేయగల మన సామర్థ్యాన్ని ప్రపంచం చూసిందని ఆయన అన్నారు. నవ భారత ఆవిర్భావానికి చిహ్నంగా మారుతున్న బెంగళూరు నగరం ఎదుగుతున్నట్లు ప్రధాని తెలిపారు. తత్వశాస్త్రం ఆత్మలో, సాంకేతిక పరిజ్ఞానం కార్యాచరణలో ఉన్న నగరం. ప్రపంచ ఐటీ పటంలో భారతదేశ జెండాను ఎగురవేసిన నగరం అని అన్నారు.బెంగళూరు విజయ గాథకు పౌరుల కృషి, ప్రతిభే కారణమని ఆయన ప్రశంసించారు. 21వ శతాబ్దంలో పట్టణ ప్రణాళిక, పట్టణ మౌలిక సదుపా యాలు మన నగరాలకు అవసరమని ప్రధానమంత్రి అన్నారు. నగరాలను మనం సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. గతంలో భారత ప్రభుత్వం నగరంలో వేల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించింది. ఇందులో భాగంగా మెట్రో ఎల్లో లైన్‌ను ప్రధాని మోదీ ప్రారంభించారు. అలాగే మెట్రో మూడవ దశకు పునాది రాయి వేశారు.

## హైదరాబాద్‌లో సీఎం

## ఆకస్మిక పర్యటన

**హైదరాబాద్, ఆగస్ట్ 10:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో హైదరాబాద్ మహా నగరం తడిసి ముద్దవుతుంది. వరుసగా ప్రతి రోజు నగరంలో ఏదో ఒక ప్రాంతంలో భారీ వర్షం కురుస్తునే ఉంది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమైనాయి. రహదారులపై సైతం భారీగా వర్షపు నీరు నిలిచిపోతుంది. డ్రైనేజీలోని మురుగు నీరు సైతం రహదారులపైకి వచ్చి భారీగా చేరుతుంది. అలాగే ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. అటువంటి పరిస్థితుల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. ఆదివారం హైదరాబాద్‌లోని వరద ముంపు ప్రాంతాలను ఉన్నతాధికారులతో కలిసి ఆయన స్వయంగా పరిశీలించారు. ఆ క్రమంలో బల్కంపేటలోని ముంపు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. అందులోభాగంగా బస్తీ వాసులతో ఆయన మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే మంచి నీరు ఎలా




వస్తుంది.. అందులో ఏమైనా మురుగు నీరు కలుస్తుందా? అంటూ వారిని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అలాగే మైత్రీవనం సమీపంలోని గంగూబాయి బస్తీని సైతం ఆయన సందర్శించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఈ సందర్భంగా ఉన్నతాధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

## డోనాల్డ్ ట్రంప్ భారతదేశ వృద్ధిని

### అంగీకరించలేకపోతున్నారు : కేంద్రమంత్రి రాజ్ నాథ్ సింగ్

**భోపాల్, ఆగష్టు 10 :** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మీద భారత రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారతదేశ వృద్ధిని ట్రంప్ అంగీకరించలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. ఇవాళ మధ్యప్రదేశ్ లోని భోపాల్ లో ఒక కార్యక్రమానికి హాజరైన రక్షణ మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్ పై ట్రంప్ విధించిన అధిక సుంకాలను మంత్రి తీవ్రంగా విమర్శించారు. ప్రపంచ శక్తులు భారతదేశ వేగవంతమైన వృద్ధిని చూసి అసూయపడుతున్నాయని పేర్కొన్నారు. ట్రంప్ మీద సూటిగా చేసిన విమర్శలలో రాజ్ నాథ్ సింగ్.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కు 'సబ్కే బాస్' అనే పదప్రయోగం చేశారు. తన సందేశాన్ని అత్యంత దృఢంగా, పూర్తి స్పష్టంగా చెప్పేశారు రాజ్ నాథ్ సింగ్. భారతదేశం సూపర్ పవర్ గా మారకుండా ఎవరూ ఆపలేరని తేల్చి చెప్పారు.'కొంతమంది భారతదేశం పురోగతిని



అంగీకరించలేకపోతున్నారు. వారు దానిని పాజిటివ్‌గా తీసుకోవడం లేదు. భారతదేశం ఇంత వేగంగా ఎలా అభివృద్ధి చెందుతోంది? అని మదనపడుతున్నారు. ' మేడ్-ఇన్-ఇండియా ఉత్పత్తులను ఇతర దేశాలకు ఎగుమతి చేసినప్పుడు వాటిని మరింత ఖరీదైనదిగా చేయడానికి ఇప్పుడు ప్రయత్నాలు జరుగుతున్నాయి' అని ఆయన అన్నారు. భారతదేశంలో తయారు చేసిన ఉత్పత్తులను ఖరీదైనవిగా చేయడం ద్వారా, ఇతర దేశాలు వాటిని దూరం చేసే ప్రయత్నంగా అమెరికా ట్రేడ్ టారిఫ్స్ ను అభివర్ణించారు మంత్రి రాజ్ నాథ్. కానీ భారతదేశం అభివృద్ధి చెందుతున్న వేగం చూస్తే, ఏ ప్రపంచ శక్తి కూడా మనం సూపర్ పవర్ గా మారకుండా ఆపలేవు. అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.రష్యా నుంచి చమురు కొనుగోలు చేసినందుకు అమెరికా, భారతదేశంపై 50% సుంకాలు, జరిమానాలను విధించిన సంగతి తెలిసిందే. ఈ చర్యను భారత ప్రభుత్వం 'అన్యాయం.. అసమంజసం' అని వ్యాఖ్యానించింది. కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ఈ ఉదయం మధ్యప్రదేశ్ లోని రైసెన్ జిల్లాలో ఉమారియా గ్రామంలో భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ 'బ్రహ్మ' రైల్ హబ్ ఫర్ మాన్యుఫ్యాక్చరింగ్ కు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ప్రసంగిస్తూ, ఆపరేషన్ సిందూర్, 'ఆత్మనిర్భర్' లేదా స్వావలంబనగా మారడానికి భారత ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను కూడా మంత్రి ప్రస్తావించారు.

### ఎస్ఎస్సీ సీజీఎల్ పరీక్షలు వాయిదా మళ్లీ ఎప్పుడంటే



**హైదరాబాద్:** ఈ నెల 13 నుంచి జరగాల్సిన స్టాఫ్ సెలక్షన్ కమిషన్ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ ఎగ్జామినేషన్ పరీక్ష వాయిదా పడింది. సెప్టెం బర్ మొదటి వారంలో పరీక్షలను నిర్వహి స్తామని, పూర్తిస్థాయి ఎగ్జామ్ షెడ్యూల్‌ను త్వరలో ప్రకటిస్తామని కమిషన్ ప్రకటిం చింది. వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలు, విభా గాలు, సంస్థలలో మొత్తం 14,582 ఖాళీల భర్తీకి ఎస్ఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా టైర్-1 పరీక్షలు ఆగస్టు 13 నుంచి 30 వరకు జరగాల్సి ఉన్నాయి.

## కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు

## 'భారత లక్ష్మి' ప్రదానం



**న్యూ ఢిల్లీ :** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యత ఉన్న కర్ణాటక ఉడుపిలోని శ్రీకృష్ణ మఠంలో పర్యట ించారు. ఈ క్రమంలోనే ఆమెకు ఉడుపిలోని చారిత్రాత్మక శ్రీ కృష్ణ మఠం 'భారత లక్ష్మి' అనే ప్రతిష్ఠాత్మక బిరుదును ప్రదానం చేసి గౌరవించింది. ఆర్థిక మంత్రిగా ఆమె దేశానికి అందిస్తున్న నిస్వార్థ సేవలకు, నిజాయితీతో కూడిన అంకితభావానికి గుర్తింపుగా ఈ బిరుదును అందించారు. ఈ సత్కారాన్ని పర్యాయ పుత్తిగే మఠం పీఠాధిపతి సుగుణేంద్ర తీర్థ స్వామి స్వయంగా ఆమెకు అందజేశారు. ఈ కార్యక్రమం సందర్భంగా నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. ఉడుపి అష్ట మఠాలు తమ సేవా సంస్కృతితో దేశానికి స్ఫూర్తిని స్తున్నాయని ప్రశంసించారు. ముఖ్యంగా 'అన్న బ్రహ్మ' సంప్రదాయం ద్వారా వేలాది మందికి నిస్వార్థంగా అన్నదానం చేయడం అభినందనీయమని కొనియాడారు. భగవద్గీత సందేశాన్ని వ్యాప్తి చేయడానికి నిర్వహిస్తున్న 'కోటి గీత లేఖన యజ్ఞ' వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు అద్భుతమైనవని ఆమె ప్రశంసించారు. ఈ కార్యక్రమాల ద్వారా సమాజంలో ధర్మం, సేవ, ఆధ్యాత్మికత పెంపొందుతాయని ఆమె పేర్కొన్నారు.ఆధ్యాత్మిక వేత్తలు, మతపెద్దలు, పండితుల సమక్షంలో జరిగిన ఈ సత్కార కార్యక్రమం నిర్మలా సీతారామన్ పర్యటనలో ఒక ముఖ్య ఘట్టంగా నిలిచింది. పీఠాధిపతి సుగుణేంద్ర తీర్థ స్వామి ఆమెకు 'భారత లక్ష్మి' బిరుదును ప్రదానం చేస్తూ.. ఆమె ఆర్థిక మంత్రిగా దేశాన్ని ప్రగతిఉడుపి అష్ట మఠా లు తమ సేవా సంస్కృతితోపథంలో నడిపిస్తు న్నారని, సామాన్యుల జీవితాల్లో మార్పు తీసుకు రావడానికి కృషి చేస్తున్నారని ప్రశంసించారు. నిజాయితీ, నిబద్ధతతో కూడిన ఆమె సేవలు దేశానికే ఆయన అన్నారు. ఈ పర్యటనలో నిర్మలా సీతారామన్ కేవలం సత్కారం మాత్రమే అందుకోలేదు. శ్రీ కృష్ణ మఠం చుట్టూ నిర్మించిన సంప్రదాయ శైలి 'యాలి' అనే ప్రత్యేక నిర్మాణాన్ని కూడా ఆమె ప్రారంభించారు.

## డిజిటల్ ఓటర్ లిస్ట్‌ను బయటపెట్టాలి

## ఈసీని డిమాండ్ చేసిన రాహుల్

**న్యూ ఢిల్లీ :** లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై మరోసారి ఎన్నికల కమిషన్‌ను లక్ష్యంగా చేసుకొని విమర్శలు గుప్పించారు. సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా ఓ వీడియోను షేర్ చేశారు. 'ఓటు దొంగతనం అనేది ఒక వ్యక్తి, ఒక ఓటు అనే ప్రాథమిక ప్రజాస్వామ్య సూత్రం దాడి. స్వేచ్ఛాయుతమైన, నిష్పాక్షికమైన ఎన్నికలకు స్వచ్ఛమైన ఓటరు జాబితా అవసరం. ఎన్నికల కమిషన్‌కు తమ డిమాండ్ స్పష్టంగా ఉంది.పారదర్శకతను చూపించాలి. డిజిటల్ ఓటర్ లిస్ట్‌ను బయటపెట్టాలి. తద్వారా ప్రజలు, రాజకీయ పార్టీలు దాన్ని స్వయంగా ఆడిట్ చేయాలి. మీరు కూడా మాతో చేరి ఈ డిమాండ్‌కు మద్దతు ఇవ్వొచ్చు.వెబ్‌సైట్‌లోకి వెళ్లండి.. లేదంటో 9650003420 నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇవ్వండి' అని రాహుల్ పిలుపునిచ్చారు. ఈ పోరాటం ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికేనని స్పష్టం చేశారు. వీడియోలో బీజేపీ, ఎన్నికల కమిషన్ కుమ్మక్కై ఎన్నికల్లో భారీ మోసానికి పాల్పడ్డారని మరోసారి ఆరోపించారు. కర్నాటకలోని ఓ నియోజకవర్గం పరిధిలో ఓటరు విశ్లేషణకు సంబంధించి వివరాలను ఉదహరించారు. బెంగళూరు సెంట్రల్‌లోని కేవలం ఒక అసెంబ్లీ నియోజకవర్గంలో లక్షకుపైగా ఫేక్ ఓటర్లను గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ లోక్‌సభ స్థానం బీజేపీ గెలిచేందుకు సహాయపడిందన్నారు. 70-100




సీట్లలో ఇలా జరిగితే ఎలా ఉంటుందో ఊహించుకోవాలని.. ఇది స్వేచ్ఛా ఎన్నికలను నాశనం చేస్తుందన్నారు.తమ వద్ద ఆధారాలు ఉన్నాయని.. ఓట్ల దొంగతనంపై తాము శక్తిమేరకు పోరాడుతామన్నారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు తమతో కలిసి రావాలని కోరారు. ఒక వ్యక్తి పోర్టల్‌లో నమోదు చేసుకునే సమయంలో 'ఓటు దొంగతనం'కు వ్యతిరేకమని పేర్కొంటూ.. అతని పేరుపై ఓ సర్టిఫికెట్ జారీ చేయబడుతుందన్నారు. ఎన్నికల కమిషన్ నుంచి డిజిటల్ ఓటరు జాబితా కోసం రాహుల్ గాంధీ డిమాండ్‌కు తాను మద్దతు ఇస్తున్నానంటూ ఆ సర్టిఫికెట్‌లో ఉంటుంది. ఈ సర్టిఫికెట్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్, ఆ పార్టీ కోశాధికారి అజయ్ మాకెన్ సంతకాలుంటాయి.

### మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయ ప్రాంగణానికి

## తెలంగాణ మంత్రులు

**మంగళగిరి, ఆగష్టు 10 :** మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం సందడి వాతావరణం నెలకొంది. తెలం గాణ మంత్రులు మంగళగిరిలోని జనసేన పార్టీ ప్రధాన ఆఫీస్ ప్రాంగణానికి విచ్చేశారు. తెలం గాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వాకిటి శ్రీహరి తదితరులు ఈ బృందంలో ఉన్నారు. (ఆదివారం)



ఒక ప్రైవేటు కార్యక్రమానికి హాజరయ్యేందుకు తెలంగాణ మంత్రులు మంగళగిరి వచ్చారు. వారు ప్రయాణించిన హెలికాప్టర్ జనసేన పార్టీ కేంద్ర కార్యాల యంలోని హెలిప్యాడ్‌లో ల్యాండ్ అయింది.ఈ సందర్భంగా జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తరఫున శాసనమండలి జనసేన పార్టీ విప్ పి. హరిప్రసాద్, ఇతర జనసేన నాయకులు తెలంగాణ మంత్రులకు స్వాగతం పలికారు. అనంతరం కార్యక్రమం ముగిసిన తర్వాత కూడా, తెలంగాణ మంత్రులకు కొండపల్లి బొమ్మలతో కూడిన జ్ఞాపికలు బహూకరించి జనసేన నేతలు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ రాక రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సహృద్భావవాతావరణానికి ప్రతీకగా నిలిచింది.

### తెలంగాణలో వారంరోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు

## హెచ్చరించిన ఐఎండీ

**హైదరాబాద్, :** తెలంగాణలో ఈ నెల 17 వరకు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుసాయని హైదరాబాద్ వాతావరణశాఖ పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో, ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షాలు పడుతాయని పేర్కొంది.



బుధవారం మెదక్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశా లున్నాయని చెప్పింది. ఆయా వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

### నోటీసు లేకుండా ఓటర్ లిస్ట్ నుంచి పేరు తొలగించం

## సుప్రీంకోర్టుకు తెలిపిన ఈసీ

**న్యూ ఢిల్లీ :** ముందస్తు నోటీసు జారీ చేయకుండా బిహార్ ముసాయిదా ఓటరు జాబితా నుంచి ఏ ఓటరు పేరును తొలగించబోమని ఎన్నికల సంఘం సుప్రీంకోర్టుకు తెలిపింది. చట్టం ప్రకారం, ముసాయిదా ఓటరు జాబితాలో చేర్చని వ్యక్తుల పేర్ల ప్రత్యేక జాబితాను తయారు చేయడం లేదా పంచుకోవడం అవసరం లేదని పోల్? ప్యానెల్ చెప్పింది.



కారణాలను ప్రచురించాల్సిన అవసరం లేదని కూడా పేర్కొంది.బిహార్? రాష్ట్రంలో అసెంబ్లీ పోల్స్ ముందు ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎన్నికల జాబితాకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లను జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారిస్తోంది. అయితే ఇప్పుడు తమ అఫిడవిట్‌లో మొదటి దశ పూర్తయిందని ఈసీ తెలిపింది. ఆగస్టు 1న ముసాయిదా ఓటర్ల జాబితాను సక్రమంగా ప్రచురించిందని పేర్కొంది."విధానపరంగా, న్యాయసూత్రాలకు కట్టుబడి 2025 ఆగస్టు 1న ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి ఏ ఓటరు పేరును తొలగించకుండా ఈ క్రింది వాటిని చేపట్టకూడదని చెబుతున్నాం. ప్రతిపాదిత ఓట్ల తొలగింపు, దాని కారణాలను సూచిస్తూ సంబంధిత ఓటరుకు ముందస్తు నోటీసు జారీ చేయడం, వాదనలు వినిపించడానికి, సంబం ధిత పత్రాలను అందించడానికి సహేతుకమైన అవకాశాన్ని కల్పించడం సమర్థ అధికారం ద్వారా సహేతుకమైన మరియు మాట్లాడే ఉత్తర్వును ఆమోదించడం" అని అది పేర్కొంది.

## రాజకీయాల నుంచి రిటైర్‌మెంట్

### పై మాటమార్చిన మాజీమంత్రి మల్లారెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 10:** రాజకీయాల నుంచి రిటైర్‌మెంట్‌పై మాజీమంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి మాటమార్చారు. రాజకీయాలకు దూరంగా ఉంటానని తాను అనలేదని క్లారిటీ ఇచ్చారు. దేశవ్యాప్తంగా విద్యాసంస్థలు పెడతానని మాత్రమే చెప్పానని స్పష్టం చేశారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్‌లోనే ఉన్నానని.. ఆ పార్టీలోనే కొనసాగుతానని తేల్చిచెప్పారు. తాను తెలుగు దేశం, బీజేపీ పార్టీలోకి వెళ్లనని స్పష్టం చేశారు మల్లారెడ్డి.జపాన్‌లో ఏ విధంగా రిటైర్‌మెంట్ ఉండదో.. రాజకీయానికి కూడా రిటైర్‌మెంట్ ఉండదని మాత్రమే తన మిత్రుడితో అన్నానని మల్లారెడ్డి చెప్పుకొచ్చారు. (ఆదివారం) జవహర్‌నగర్‌లో మల్లారెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మీడియాతో మాట్లాడారు. మల్లారెడ్డి మొదట ఏమన్నారంటే..తాను రాజకీయంగా బీజేపీ వైపా, టీడీపీ వైపా, బీఆర్‌ఎస్ పార్టీల వైపా అన్నది కాదని... తాను ఇప్పటికీ కూడా బీఆర్‌ఎస్‌లోనే ఉన్నానని తెలిపారు.



తాను ఇప్పుడు ఏ వైపునకు చూసేటట్లుగా కూడా లేనని చెప్పారు. తనకు 73సంవత్సరాలు వచ్చాయని.. ఇంకా ఏవైపునకు చూడాల్సిన అవసరం ఏముందని అన్నారు. తాను ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రిని అయ్యానని ఇంకా మూడేళ్లు రాజకీయాల్లో ఉంటానని వెల్లడించారు. అస్సలు తాను రాజకీయమే వద్దనుకుంటున్నానని తెలిపారు. ప్రజలకు సేవ చేసి మంచి కాలేజీలు, యూనివర్సిటీలు నడిపిద్దామని అనుకుంటున్నానని మల్లారెడ్డి పేర్కొన్నారు

మెదక్ టుడే
MEDAK TODAY
సోమవారం, ఆగష్టు 11 2025

# జిల్లా వ్యాప్తంగా జ్వర సర్వే పగడ్బందీగా నిర్వహించాలి

**- కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలి.**
**- కౌడిపల్లిలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌ను తనిఖీ**
**- కౌడిపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**





**మెదక్.. కౌడిపల్లి మండలం ఆగస్టు 10 మెదక్ టుడే న్యూస్**
మూడు రోజులకు మించి జ్వరంతో బాధపడుతున్నట్లయితే తక్షణమే దగ్గరలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్యులతో పరీక్షలు చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ రోగులకు సూచించారు. ఆదివారం కౌడిపల్లి మండలం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలోని వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్, ఓపి రిజిస్టర్, ఏఎన్ సీ, ఇన్ పేషెంట్ ,మందుల స్టాక్ రిజిస్టర్ ,తదితర రిజిస్టర్ లను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా జ్వర సర్వేను నిర్వహించడం జరుగుతున్నదని, అయితే వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు సంభవిస్తున్నాయని, ప్రజలు సీజనల్ వ్యాధుల వల్ల ఇబ్బందులు పడకుండా ఉండేందుకుగాను జ్వరం వచ్చినప్పుడు తక్షణమే డాక్టర్ ను సంప్రదించి చికిత్స చేయించుకోవాలని చెప్పారు. ప్రత్యేకించి 3 రోజులకు మించి జ్వరం ఉన్నట్లయితే నిర్లక్ష్యం చేయకుండా దగ్గర్లో ఉన్న ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి వచ్చి డాక్టర్ తో చూయించుకోవాలని తెలిపారు. సీజనల్ వ్యాధులతో పాటు, అన్ని రకాల జబ్బులకు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలలో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, అంతేకాక అవసరమైన మందులు సైతం సిద్ధంగా ఉన్నాయని, అందువల్ల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం డాక్టర్లు వారి పరిధిలో ఎప్పటికప్పుడు జ్వరపీడితులను గమనిస్తూ ఉండాలని, ఆశ, అంగన్వాడీ కార్యకర్తల ద్వారా ఎప్పటికప్పుడు గ్రామాల నుండి సమాచారాన్ని సేకరించి వైద్యం అందించే విధంగా సిద్ధంగా ఉండాలని, ఇందుకు గాను మందులతో పాటు, ఇతర పరీక్షలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు.కౌడిపల్లి మండలంలో నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవనాన్ని పరిశీలించి,నాణ్యత ప్రమాణాలతో సెప్టెంబర్ నాటికి పనులు పూర్తి చేయాలని ని ఆదేశించారు. కౌడిపల్లిలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌ను తనిఖీ చేసి, వంటగది, నిల్వ గది నిర్వహణ, శుభ్రత మరియు త్వరగా పాడైపోయే వస్తువుల నాణ్యత మొదలైన వాటిని తనిఖీ చేశారు. నాణ్యమైన మేనూ అందించడంతోపాటు గుణాత్మక విద్య బోధించాలన్నారుఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# రంగంపేట గ్రామంలో గల తిరుమల రైస్ మిల్లు లో చోరీ



**మెదక్.. కొల్చారం మండలం ఆగస్టు 10 మెదక్ టుడే న్యూస్** మెదక్ జిల్లా కొల్చారం మండలంలో శనివారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. బాధితులు తెలిపిన వివరాలు మండల పరిధిలోని రంగంపేట గ్రామ శివారులోని తిరుమల రైస్ మిల్ లో అర్ధరాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. తిరుమల రైస్ మిల్ ప్రధాన ద్వారం తాళాలు ధ్వంసం చేసి లోనికి చదవబడిన దొంగలు బీరువాలో ఉన్న సుమారు నాలుగు లక్షల రూపాయలు చోరీకి పాల్పడినట్టు బాధితుడు ముప్పిడి కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలానికి చేరుకున్న మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, కొల్చారం మహమ్మద్ మోహియోద్దీన్ విచారణ చేపట్టారు. క్లూస్ టీం సహాయంతో వివరాలు సేకరిస్తున్నారు

# నులిపురుగుల నివారణ తో ఆరోగ్యం

**- మండల వైద్యాధికారి సాయి సింధు**

**మెదక్ జిల్లా, చిన్న శంకరంపేట. ఆగస్టు 10 (మెదక్ టుడే):-** నులి పురుగుల నివారణతో పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని మండల వైద్యాధికారి సాయి సింధు అన్నారు. నులిపురుగుల నివారణకై మండల పరిధిలోని అన్ని పాఠశాలలు, అంగన్వాడీలు మరియు కాలేజీలలోని పిల్లలకు ఆల్బండజోలు టాబ్లెట్స్ ఇవ్వడం జరుగుతుందని మండల వైద్యాధికారి సాయి సింధు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ...పిల్లల లో ముఖ్యంగా 1సంవత్సరము నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికి తరుచుగా కడుపు నొప్పి, త్వరగా అలిసి పోవడం, చదువు పైన ద్రుష్టి పెట్టకపోవడం, చెప్పిన విషయాలు గుర్తు ఉండకపోవడం లాంటి సమస్యలు తరుచుగా సంభావిస్తాయి.ఇందుకు అనేక కారణాలలో ముఖ్యం గా పిల్లలలో నులి పురుగులు ఉండడం.పిల్లలు తినే ఆహారం లోని పోషకాలను నులిపురుగులు తీసుకొని పిల్లలకు రక్తహీనత కలుగ జేస్తాయి.కాబట్టి నేటి నుండి అన్ని ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలలు, కాలేజీ, అంగన్వాడీ కేంద్రాలలోని పిల్లలకు నులిపురుగుల నివారణ మందులు ఇవ్వడమే కాకుండా వ్యక్తిగత పరిశుభ్రత మరియు తినే ముందు చేతులు ఎలా శుభ్రం చేసుకోవాలో అవగాహన కల్పిస్తారని తెలిపారు.

## ఇందిరా మహిళా శక్తి భవనం నిర్మాణ పనులు గడువు తేదీలోగా త్వరితగతిన పూర్తి చేసి ఉపయోగం లోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు.




**మెదక్ ఆగస్టు 10 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి**ఆదివారం మెదక్ జిల్లా కేంద్రంలో బోధన్ రోడ్ లో గాంధీనగర్ ఏరియాలో గల ఐదు కోట్ల రూపాయల వ్యయంతో నిర్మాణంలో ఉన్న ఇందిరా మహిళా శక్తి భవన్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ముందుగా నిర్మాణ పనులపై కలెక్టర్ మ్యాప్ పరిశీలిస్తూ సంబంధిత కాంట్రాక్టర్ ను పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు., నవంబర్ నాటికి నిర్దేశిత గడువు తేదీలోగా పనులుపూర్తి చేయాలని ఈ పి ఆర్ ని ఆదేశించారు.

# నల్ల పోచమ్మ జాతర ఉత్సవంలో పాల్గొన్న ప్రముఖ కాంగ్రెస్ సేవకుడు అయిత పరంజ్యోతి

**చేగుంట ఆగస్టు 10 మెదక్ టుడే న్యూస్**
చేగుంట మండల కేంద్రంలోని నల్లపోచమ్మ జాతర ఉత్సవంలో పాల్గొన్న ప్రముఖ సంఘ సేవకుడు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అయిత పరంజ్యోతి. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తను మాట్లాడుతూ చేగుంట గ్రామ ప్రజలను అలాగే మండలంలో ఉన్న గ్రామాల ప్రజలను సంతోషంగా ఉంచాలని వర్షాలు బాగా పడి పంట అందరికీ బాగుండాలని అన్నారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కర్రీ రాములు, కర్రె నర్సింలు,స్టాలిన్ సిరిబోజి నర్సింలు, తదితరులు పాల్గొనడం జరిగినది





# త్రిబుల్ ఐటీ సీటుసాధించిన విద్యార్థినికి





**- లయన్స్ క్లబ్ ఆఫ్ చేగుంట ఆర్థిక సహాయం**

**చేగుంట ఆగస్టు 10 మెదక్ టుడే న్యూస్**
లయన్స్ క్లబ్ ఆఫ్ చేగుంట ఆధ్వర్యంలో రెడ్డిపల్లి గ్రామానికి చెందిన మధ్యతరగతి విద్యార్థిని రచన కు ఆర్థిక సాయం చేయడం జరిగింది. రెడ్డిపల్లి గ్రామానికి చెందిన రచన ఇటీవలే ప్రభుత్వ పాఠశాలలో చదివి త్రిబుల్ ఐటీ సీటు సాధించింది, కానీ త్రిబుల్ ఐటీ లో చేర డానికి అయ్యే కనీస ఖర్చులు ఫీజులకు ఇబ్బంది పడుతున్న ఆ విద్యార్థినినీ గమనించిన లయన్స్ క్లబ్ ఆఫ్ చేగుంట వారు ఘనంగా మెమెంటో తో సన్మానం చేయడం జరిగింది. అలాగే మన క్లబ్ ట్రెజరర్ అయినటువంటి లయన్ కొంద్రు నాగేశ్వర్ ఆ విద్యార్థిని కి 2000/-(రెండు వేల రూపాయలు) ఆర్థిక సాయం చేసి వారి యొక్క సేవా దృక్పథం చాటుకున్నాడు. ఆ విద్యార్థిని యొక్క చదువుకు సహాయపడినటువంటి లయన్ నాగేశ్వర్ లయన్స్ సభ్యులు అభినందించారు. అలాగే విద్యార్థిని మాట్లాడుతూ నాకు త్రిబుల్ ఐటీ సీటు వచ్చినందున నన్ను సన్మానించి ఆర్థిక సహాయం చేసినందున ఈ ప్రోత్సాహం తో పై చదువులకు ఇదే ఆదర్శంగా తీసుకొని కష్టపడి చదువుకొని మంచి ఉద్యోగం సంపాదిస్తానని తెలియజేసింది .ఇలాంటి సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ ఎప్పుడు ముందుంటుందని లయన్స్ క్లబ్ ఆఫ్ చేగుంట వారు తెలియజేశారు.ఈ యొక్క కార్యక్రమంలో ప్రెసిడెంట్ లయన్ శంభుని శ్రీనివాస్, సెక్రెటరీ లయన్ పులబోయిన నాగరాజు, ట్రెజరర్ లయన్ కొంద్రు నాగేశ్వర,జోన్ చైర్‌పర్సన్‌లయన్ ఆకుల సుఖేందర్,విద్యార్థిని పాల్గొన్నారు.

## ఈనెల 13లోపు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి జిల్లా వ్యవసాయ అధికారి ఏ దేవకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.



**మెదక్ ఆగస్టు 10 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి** తమ కొత్త పట్టా పాస్‌బుక్‌లతో ఈనెల 13లోపు రైతుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయశాఖ సూచించారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి, జూన్ 5 వరకు కొత్త పాస్‌బుక్‌లు పొందిన రైతులు రైతుబీమా పథకం-2025 పాలసీలో చేరడానికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఏఈవోలు రైతుబీమా వివరాల నమోదు కార్యక్రమాన్ని చేపడతారని జిల్లా వ్యవసాయ అధికారి సూచించారు

# సీఎం చంద్రబాబుని చూసి జగన్ అండ్ కో బుద్ధి తెచ్చుకోవాలి: ఎంపీ కలిశెట్టి




**విజయనగరం, ఆగస్టు 10:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తెలుగుదేశం విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. (ఆదివారం) విజయనగరంలో ఎంపీ కలిశెట్టి, మంత్రి కొండపల్లి పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీ కలిశెట్టి మీడియాతో మాట్లాడారు. వైసీపీ నేతలందరూ జగన్‌కి జ్ఞానోదయం చేయాలని హితవు పలికారు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు.సీఎం చంద్రబాబునాయుడుని చూసి జగన్ అండ్ కో బుద్ధి తెచ్చుకోవాలని సూచించారు. పరిశ్రమల స్థాపన కోసం చంద్రబాబు పాటుపడుతుంటే, పారిశ్రామిక వేత్తలు ఆంధ్రప్రదేశ్‌కు రావొద్దని జగన్ ప్రయత్నం చేస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పనిచేస్తామంటే టీడీపీ నేతలు ఎప్పుడూ అడ్డుకోలేదని.. అయినా జగన్ ఏమీ చేయలేక పోయారని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విమర్శించారు.బొత్స సత్యనారాయణపై మంత్రి కొండపల్లి ఫైర్మంత్రిగా పనిచేసిన బొత్స సత్యనారాయణ తన కుటుంబం ఎదుగుదలకే పాటుపడ్డారు తప్పా సొంత జిల్లాకు ఒరిగిందేమీ లేదని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విమర్శించారు. వైసీపీ హయాంలో తాను ఏం చేస్తున్నది కూడా చెప్పుకోలేని దీనస్థితిలో బొత్స సత్యనారాయణ కాలం గడిపారని ఆక్షేపించారు. ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడిపై వైసీపీ నేతలు నిందలు వేశారని మండిపడ్డారు మంత్రి కొండపల్లి శ్రీనివాస్.ఈ ఆరోపణలపై తనపై విచారణ జరిపించాలని అయ్యన్నపాత్రుడు గవర్నర్‌ని కోరారని గుర్తుచేశారు. విజయసాయిరెడ్డి, సుబ్బారెడ్డి చేసిన అవినీతి, ఉత్తరాంధ్రాకు చేసిన అన్యాయంపై బొత్స సత్యనారాయణ విచారణ కోరగలరా అని ప్రశ్నించారు. ఎన్నికల ముం దు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తున్న ఘనత ప్రభుత్వానిదని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.

# జగన్ మేనమామ రవీంద్రనాథ్ రెడ్డిపై చర్యలకు రంగం సిద్ధం




**తిరుమల, ఆగస్ట్ 10:** తిరుమల అంటేనే పవిత్రమైన ఆధ్యాత్మిక క్షేత్రం. ఈ క్షేత్రంలో.. అది కూడా ఆ దేవదేవుడు శ్రీవెంకటేశ్వర స్వామి వారు కొలువైన ఆనంద నిలయం వెలుపల రాజకీయాలు, రీల్స్ వంటివి చేయవద్దంటూ తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఇప్పటికే కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలు అతిక్రమిస్తే చర్యలు తప్పవంటూ టీటీడీ క్లియర్‌కట్‌గా హెచ్చరించింది. అయితే ఈ ఆదేశాలను వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ సొంత మేనమామ, ఆ పార్టీ నేత రవీంద్రనాథ్ రెడ్డి అతిక్రమించారు. ఆదివారం ఉదయం శ్రీవారిని ఆయన దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల పలు రాజకీయ ఆరోపణలు చేశారు. ఆయన చేసిన రాజకీయ ఆరోపణల వీడియోలు.. మీడియా, సోషల్ మీడియాలో వైరల్ అయినాయి. దీంతో తిరుమలలో ఆయన ఇలా చేయడం ఏమిటంటూ రవీంద్రనాథ్ రెడ్డి వ్యవహార శైలిని పలువురు ప్రశ్నించారు.అలాగే ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు సైతం టీటీడీ అధికారులను డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇదే అంశాన్ని టీటీడీ విజిలెన్స్ విభాగం పరిశీలిస్తుంది. తిరుమలలో శ్రీవారి ఆలయ పవిత్రతను దృష్టిలో ఉంచుకుని.. ఎవరు ఎటువంటి రాజకీయ వ్యాఖ్యలు కానీ.. రీల్స్ కానీ చేయవద్దంటూ ఇటీవల టీటీడీ బోర్డు సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. అలాంటి వేళ.. మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి.. టీటీడీ నిర్ణయాన్ని అతిక్రమించారని విజిలెన్స్ విభాగంగా నిర్ణయించింది. ఆ క్రమంలో ఆయనపై చర్యలు తీసుకునే దిశగా విజిలెన్స్ విభాగం అడుగులు వేస్తోంది.

# మనమిత్రలో మరిన్ని సేవలు




**చిత్తూరు కలెక్టరేట్, :** ప్రభుత్వ సేవలకోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా వాటిని ఇంటినుంచే పొందేందుకు రాష్ట్రప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్‌ను తీసుకొచ్చింది. మనమిత్ర పేరిట అమలవుతున్న ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో ఎక్కడినుంచైనా సేవలు పొందేందుకు, ఫిర్యాదులు చేసేందుకు సచివాలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించారు. మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఈ పౌరసేవలు అందిస్తున్న ప్రభుత్వం వాటిని 700కు పెంచాలని నిర్ణయించింది. ఈనెల 15వ తేదీనుంచి మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఈ సేవలను అందించేలా చర్యలు చేపట్టారు.ఈ ఏడాది జనవరిలో 26 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన 161 సేవలతో 'మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్' ప్రారంభం కాగా, సేవలను క్రమంగా పెంచారు. ప్రస్తుతం 500 సేవల దాకా అందుతున్నాయి. వీటిని 15వ తేది నుంచి 700దాకా పెంచాలని ప్రభుత్వం వేస్తున్న ప్రభుత్వం 'మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్' పేరుతో పౌరసేవలు సెల్‌ఫోన్ ద్వారా అందుబా టులోకి తెచ్చిన విషయం తెలిసిందే. ఇందులో విద్యార్థులకు పరీక్షల హాల్ టికెట్లు, రేషన్ కార్డుల సేవలు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ స్టేటస్‌లు తెలుసుకునే వెసులుబాటు కల్పించారు. తెలుగు, ఆంగ్ల భాషల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి.పౌరులు ఒక్క క్లిక్‌తో లైసెన్సులు, పన్నులు, బిల్లులు చెల్లించవచ్చు. ఆలయాల దర్శనాల బుకింగు, పరీక్షల ఫలితాలు ఇంటివద్దనుంచే తెలుసుకునే అవకాశం కల్పించారు. అన్ని శాఖల డేటాను ఆర్టీజీఎస్‌ఈ ప్రభుత్వం అనుసందానం చేసింది. ప్రతిఒక్కరి వ్యక్తిగత సమాచారం ప్రభుత్వం వద్ద ఉంది. దీనిని శాఖలవారీగా మన మిత్ర వాట్సప్ గవర్నెన్స్‌కు అనుసంధానం చేశారు.క్యూఆర్ కోడ్‌తో ధ్రువపత్రాలు, ఇతర పౌరసేవలు పొందవచ్చు. భవిష్యత్తులో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా నకిలీ, అసలు గుర్తించే సౌలభ్యం అందుబాటులోకి రానుంది. ప్రభుత్వ వాట్సాప్ నెంబరు. 9552300009ను మనమిత్ర పేరిట మీ ఫోన్‌లో నమోదుచేసుకోవాలి. ఆ నెంబరుకు హాయ్ అని సందేశం పంపాలి. వెంటనే ఏపీ ప్రభుత్వ లోగోతో ఒక సందేశం వస్తుంది. తద్వారా మీకు కావాల్సిన సేవను ఎంపిక చేసుకోవాలి. వెంటనే మీకు వాట్సాప్ ఏఐ ఆధారిత చాట్ బాక్స్‌లో లభ్యమయ్యే అన్ని ప్రభుత్వ సేవల జాబితా కనిపిస్తుంది. అందులో మీకు కావాల్సిన సేవను ఎంపిక చేసుకోవచ్చు. వాయిస్ కమాండ్‌ను కూడా ఉపయోగించుకోవచ్చు. మీరు కోరుకున్న సేవకు సంబంధించి చాట్ బాక్స్ మరికొన్ని అదనపు వివరాలు అడగవచ్చు. మీ ఆధార్ నెంబర్, మొబైల్ నెంబరు, లేదా సర్వీస్ రిక్వెస్ట్ ఐడీకలెక్టరేట్లో మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ బోర్డు లాంటివి, మీరిచ్చిన కావాల్సిన సేవను వివరాలను ఒక్కసారి తనిఖీ చేసి, తర్వాత అందులో సిస్టమ్ మీకు రియల్ టైం అప్‌డేట్స్ ద్వారా ఒక కన్ఫర్మేషన్ సందేశం పంపుతుంది. చెల్లింపులకోసం భద్రతతో కూడిన ఒక పేమెంట్ లింకును కూడా పంపుతుంది. మీరు జరిపిన లావాదేవీలకు సంబంధించి డిజిటల్ కాపీ లేదా రసీదును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. చాట్‌బాక్స్‌లో ధ్రువీకరణ పత్రాలు, రశీదులు లేదా అక్నాలెడ్జ్‌మెంట్ రూపొందించి మీకు అందిస్తుంది.

# ఆ ఘనత మా ప్రభుత్వానిదే అనిత ఇంట్రెస్టింగ్ కామెంట్స్



**అనకాపల్లి జిల్లా, ఆగస్టు 10 :** రైతులకు ఎన్డీఏ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత ఉద్ఘాటించారు. (ఆదివారం) అనకాపల్లి జిల్లాలో ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హోం మంత్రి అనిత పర్యటించారు. తాండవ రిజర్వాయర్ ప్రాజెక్ట్ ఆయకట్టు నీటిని విడుదల చేశారు. నీటిని విడుదల చేసి, జలహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మీడియాతో మాట్లాడారు తాండవ ఆయకట్టుపై ఎంతోమంది రైతులు ఆధారపడ్డారని చెప్పుకొచ్చారు. తాండవ రిజర్వాయర్ నీటి విడుదల కార్యక్రమంలో పాల్గొనడం తన అదృష్టమని వ్యాఖ్యానించారు. గత జగన్ ప్రభుత్వంలో తాండవ రిజర్వాయర్‌ను పట్టించుకోలేదని విమర్శించారు. కనీసం గేట్ల మరమ్మతులు కూడా చేయలేదని ఆరోపించారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అయ్యన్నపాత్రుడు ఆధ్వర్యంలో ఈ రిజర్వాయర్ గేట్లు మరమ్మతులు చేయించారని తెలిపారు వంగలపూడి అనిత .ఈ రిజర్వాయర్ ద్వారా 50 వేల ఎకరాలకు సాగునీటిని ఇస్తున్నామని ఉద్ఘాటించారు. తుని, పాయకరావుపేట, నర్సీపట్నం నియోజకవర్గాల రైతులు ఈ రిజర్వాయర్‌పై ఆధారపడ్డారని వెల్లడించారు. తమ ప్రభుత్వంలో పంటలకు గిట్టుబాట ధర కల్పిస్తున్నామని నొక్కిచెప్పారు. బుడమేరు గట్టులు మరమ్మతులు చేయకపోవడంతోనే వరదలు వచ్చాయని వంగలపూడి అనిత పేర్కొన్నారు.


# అడవి తల్లి బాటపై ప్రత్యేక ఫోకస్ అధికారులకు పవన్ కళ్యాణ్ సూచనలు



**అమరావతి:** రాష్ట్ర పంచాయతీరాజ్ అధికారులతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. గిరిజన ప్రాంతాల్లో 'అడవి తల్లి బాట' పేరిట చేపట్టిన నూతన రహదారుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఆయన సూచించారు. పనులు పూర్తయితే 625 గిరిజన ఆవాసాలకు మెరుగైన రహదారి సౌకర్యం ఏర్పాటవుతుందని తెలిపారు. డోలీరహిత గిరిజన ఆవాసాలే లక్ష్యం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రోడ్ల నిర్మాణంపై నిరంతర పర్యవేక్షణ చేయాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు. రెండు వారాలకు ఒకసారి శాఖాపరంగా సమీక్షించి నిర్మాణ పురోగతిపై నివేదిక ఇవ్వాలని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం, డోలీరహిత గిరిజన ఆవాసాలు ఉండాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తోందని స్పష్టం చేశారు. అధికారులందరి.. సమిష్ట కృషితోనే ఇది సాధ్యపడుతుందని చెప్పుకొచ్చారు.అడవి తల్లి బాటపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పీఎం జన్‌మన్ పథకం ద్వారా రూ.555.6 కోట్లు నిధులు కేటాయించి సహకారం అందించిందని పవన్ కళ్యాణ్ తెలిపారు. అదే విధంగా జాతీయ ఉపాధి హామీ పథకం నిధులను వినియోగించుకొంటున్నట్లు వివరించారు. ఇన్ని అవకాశాలు ఉన్నందున అడవి తల్లి బాట పనుల విషయంలో అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఆయన సూచించారు. స్వాతంత్ర్యం వచ్చాక తొలిసారి రోడ్డు సౌకర్యం పొందే ఆవాసాలు కూడా ఈ పథకంలో ఉన్నాయని గుర్తుచేశారు. కాబట్టి గిరిజన ప్రాంతాల్లో చేపట్టిన పనుల గురించి స్థానికులకు కూడా తెలియజేయడం ఎంతో అవసరని అభిప్రాయపడ్డారు. డోలీరహిత ఆవాసాలు ఉండాలనే సంకల్పంతో చేపట్టిన విషయాన్ని చెప్పాలని పేర్కొన్నారు. తద్వారా వారి సహకారం, ప్రోత్సాహం కూడా లభిస్తుందని పవన్ కళ్యాణ్ చెప్పుకొచ్చారు.

# పవన్‌ను బంధించింది ఎవరు

- తిరుపతి నుంచి చిత్తూరుకు ఎలా వెళ్లాడు?
-' వైసీపీ దాడి ఘటనపై కొనసాగుతున్న దర్యాప్తు




**తిరుపతి(నేరవిభాగం),:** వైసీపీ నేతల చేతిలో దారుణ హింసకు గురైన పవన్ కుమార్‌ను చిత్తూరులో బంధించింది ఎవరు? అతని వాయిస్ రికార్డు చేసి వీడియోలు విడుదల చేసిందెవరు? తిరుపతిలో దాడికి గురైన పవన్ చిత్తూరుకు ఎలా వెళ్లాడు? రౌడీ మూకలకు భయపడి తలదాచుకున్నాడా? లేకుంటే ఎవరైనా బలవంతంగా తీసుకెళ్లి బంధిం చారా అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ వ్యవహారంలో తిరుపతికి చెందిన వైసీపీ కీలక నేతల ప్రమేయంపైనా ఆరా తీస్తున్నారు.గొడవకు కారణాలపై ఆరాతిరుపతిలోని ఒక హోటల్‌లో రిసెప్షనిస్టుగా పనిచేస్తున్న పవన్ కుమార్‌కు, వైసీపీ నేతలకు మధ్య గొడవకు గల కారణాలపైనా పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. కేవలం డబ్బు వ్యవహారమేనా లేదా పాత కక్షలు ఏమైనా ఉన్నాయా అని ఆరా తీస్తున్నారు.దర్యాప్తు వేగవంతంఈ ఘటనను ప్రభుత్వ పెద్దలు సీరియస్‌గా తీసుకోవడంతో జిల్లా పోలీసులు దర్యాప్తులో వేగం పెంచారు. అదనపు ఎస్పీ నేతృత్వంలో డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది టీమ్‌లుగా విడిపోయి దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే వైసీపీ సోషల్ మీడియా అధ్యక్షుడు అనిల్ కుమార్ రెడ్డి, బైక్ రెంటల్ అధినేత జగదీశ్వరరెడ్డిలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. పోలీసుల అదుపులో ఉన్న మరో నిందితుడు దినేష్‌ను విచారిస్తున్నారు. మరికొందరు అనుమానితుల పాత్రపై దర్యాప్తు చేస్తున్నారు.

# మాపై దాడులు చేసి, మాపైనే కేసులు పెడతారా పులివెందుల ఘటనపై డీజీపీకి వైసీపీ నాయకుల ఫిర్యాదు



**పులివెందుల :**జడ్పీటీసీ ఉప ఎన్నిక సందర్భంగా వైసీపీ పార్టీ కార్యకర్తలు, నాయకులను భయభ్రాంతులకు గురిచేసే కుట్ర చేస్తున్నారని మాజీ మంత్రి, వైసీపీ నేత మేరుగు నాగార్జున ఆరోపించారు. ప్రజాస్వామ్యం కాపాడుతుందనే నమ్మకంతోనే వైసీపీ ఎన్నికలకు వెళ్తుందని.. కానీ మాపై దాడులు చేసి.. మాపైనే కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది న్యాయమా? ధర్మమా అని ప్రశ్నించారు.స్థానిక సంస్థల ఉప ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై డీజీపీ కార్యాలయంలో వైసీపీ ప్రతినిధి బృందం ఆదివారం నాడు వినతి పత్రం సమర్పించింది. అధికార టీడీపీ పార్టీకి తొత్తులుగా మారి పోలీసులే చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్నారని.. దీనిపై తక్షణమే స్పందించాలని వైసీపీ ప్రతినిధి బృందం ఆ లేఖలో కోరింది. దేశంలో ఎక్కడా చూడని విధంగా రాష్ట్రంలో పోలీసులు ఇంతగా అధికార పార్టీకి లొంగిపోయి, చట్టాలనే అపహాస్యం చేసేలా వ్యవహరిస్తున్న తీరుపై డీజీపీ స్పందించి, ప్రజాస్వామ్య రక్షణకు నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డీజీపీ కార్యాలయం వెలుపల మీడియాతో మాట్లాడారు.ఈ సందర్భంగా మేరుగు నాగార్జున మాట్లాడుతూ.. ఈ నెల 5వ తేదీన ఎన్నికల ప్రచారం ముగించుకుని వస్తున్న ఎమ్మెల్సీ రమేశ్ యాదవ్‌తో పాటు పలువురు నాయకులపై కర్రలు, ఇనుపరాడ్లు, రాళ్లతో పది వాహనాల్లో వచ్చిన టీడీపీ అరాచక శక్తులు దాడులకు పాల్పడ్డాయని ఆరోపించారు. ఈ దాడిపై చర్యలు తీసుకోవాలని డీఎస్పీ వద్దకు వెళ్తే ఆయన కూడా పట్టించుకోలేదని అన్నారు. రక్షణ కల్పించాల్సిన పోలీసులే టీడీపీ వారికి అండగా నిలబడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తిని పోలీసు వ్యవస్థ నీరుగారుస్తోందని ఆరోపించారు.పోలీసు యంత్రంగాన్ని చేతుల్లో పెట్టుకుని అధికార టీడీపీ చేస్తున్న అరాచకాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని మేరుగు నాగార్జున విమర్శించారు. ఇటువంటి దారుణ పరిస్థితుల్లోనూ వైసీపీ శ్రేణులు ఎక్కడా భయపడకుండా ముందుకు సాగుతుంటే.. దాన్ని కూడా సహించలేక ఎవరైతే మాపై దాడులు చేశారో.. వారి నుంచే ఫిర్యాదులు తీసుకుని.. బాధితులైన వైసీపీ నాయకులు, కార్యకర్తలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్లతో కేసులు నమోదు చేయడం ఈ ప్రభుత్వ అరాచకానికి, పోలీసు వ్యవస్థ దిగజారుడుతనానికి పరాకాష్టగా కనిపిస్తోందని విమర్శించారు. ఇంత అమానుషంగా చంద్రబాబు పాలన సాగుతుందని మండిపడ్డారు. దీనికి చంద్రబాబు ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు.

# మోస్ట్ వాంటెడ్ ఎర్రచందనం స్మగ్లర్ అరెస్ట్



**కడప:** గత కొంతకాలంగా జిల్లా పోలీసులుకు నిద్రలేకుండా చేసిన మోస్ట్ వాంటెడ్ ఎర్రచందనం స్మగ్లర్ నాగ దస్తగిరి రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. నాగ దస్తగిరితో పాటు మరో ఐదుగురు స్మగ్లర్లను మైదుకూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. అరెస్ట్ వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు.మైదుకూరు సబ్ డివిజన్ పరిధిలో ఆరు మంది ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ అశోక్ కుమార్ వివరించారు. వారి నుంచి ఒక టన్ను ఎర్రచందనం దుంగలు, రెండు కార్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ అరెస్టులో.. మోస్ట్ వాంటెడ్ ఎర్రచందనం స్మగ్లర్ ఇరగంరెడ్డి నాగదస్తగిరి రెడ్డి పట్టుబడినట్లు తెలిపారు. నాగదస్తగిరిపై ఇప్పటికే 86 ఎర్రచందనం కేసులు, 34 చోరీ కేసులు, 3 పీడీ యాక్టు కేసులు ఉన్నాయని తెలిపారు. అతని భార్య లాలుబీని కూడా వారం క్రితం పోలీసులు అరెస్టు చేసినట్లు ఎస్పీ అశోక్ వెల్లడించారు. నాగదస్తగిరిని అరెస్ట్ చేసిన మైదుకూరు పోలీసులను ఎస్పీ అభినందించారు

# పులివెందుల జడ్పీటీసీ ఎన్నిక 550 మందిపై బైండోవర్ కేసులు

**పులివెందుల :**జడ్పీటీసీ ఉప ఎన్నికల నేపథ్యంలో పులివెందులలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పులివెందుల నియోజకవర్గంలో ఐదు పోలింగ్ కేంద్రాలు ఉండగా వాటన్నింటినీ సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. ఇక ఒంటిమిట్టలో 17 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. అందులో 4 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకంగా ఉన్నాయని పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో జడ్పీటీసీ ఎన్నికల కోసం పోలీసులు భారీగా బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు పులివెందులలో 550 మందిపై బైండోవర్ కేసులు నమోదయ్యాయి.పులివెందుల, ఒంటిమిట్టలో ఉప ఎన్నిక నేపథ్యంలో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టామని కడప జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. రెండు ప్రాంతాల్లో 1100 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పులివెందులలో ఇప్పటికే 550 మందిపై బైండోవర్ కేసులు పెట్టామని తెలిపారు. నిర్బంధం చేస్తామని పేర్కొన్నారు. మీడియాపై డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచుతామని చెప్పారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ సందర్భంగా అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు.ఇవాళ సాయంత్రంతో ఎన్నికల ప్రచారం ముగియనుండటంతో.. 5 గంటల తర్వాత నుంచి స్థానికేతరులు గ్రామాల్లో ఉండటానికి వీల్లేదని ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. ఎక్కడా ఎటువంటి అల్లర్లు జరగకుండా నిరంతర పర్యవేక్షణ చేస్తామని వెల్లడించారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు

మెదక్ టుడే MEDAK TODAY
సోమవారం, ఆగష్టు 11 2025

# ఆపరేషన్ సిందూర్- కీలక విషయాలు చెప్పిన చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది

పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చేస్తున్న పోరాటంలో ఒక కొత్త అధ్యాయమని తెలిపారు చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది. నిఘా నేతృత్వంలోని జరిగిన ఆపరేషన్ అదని చెప్పారు. భారత్ చురుకైన భద్రతా వైఖరిని బలోపేతం చేయడంలో స్వదేశీ సాంకేతికత, సైనిక చర్య పాత్రను ఆపరేషన్ సిందూర్ నొక్కిచెబుతుందని అన్నారు.ఈ మేరకు ఐఐటీ మద్రాస్‌లోని 'అగ్నిశోధ్' – ఇండియన్ ఆర్మీ రీసెర్చ్ సెల్ ను ఇటీవల ప్రారంభించిన ఆయన, పలు వ్యాఖ్యలు చేశారు. ఇది రక్షణ సాంకేతికతలో స్వావలంబన వైపు వేసిన ఒక ముఖ్యమైన అడుగును సూచిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులను ఉద్దేశించి ఆపరేషన్ సిందూర్ అంశంపై జనరల్ ఉపేంద్ర ద్వివేది మాట్లాడారు. ఆ సమయంలో కీలక విషయాలు వెల్లడించారు."ఆపరేషన్ సిందూర్‌లో మేం చెస్ ఆడాం. శత్రువు తదుపరి కదలిక ఏమి ఉండబోతుందో, మేం ఏమి చేయబోతున్నామో మాకు తెలియదు. దీనిని గ్రే జోన్ అంటారు. గ్రే జోన్ అంటే మనం సంప్రదాయ కార్యకలాపాలకు వెళ్లడం లేదు. మనం చేస్తున్నది సంప్రదాయ ఆపరేషన్ కంటే



తక్కువ. మనం చెస్ కదలికలు చేస్తున్నాం. శత్రువు కూడా చెస్ కదలికలు చేస్తున్నాడు. ఎక్కడో మనం వారికి చెక్‌మేట్ ఇస్తున్నాం. ఎక్కడో మన సొంతదాన్ని కోల్పోయే ప్రమాదంతో చంపడానికి వెళ్తున్నాం" అని జనరల్ ఉపేంద్ర ద్వివేది తెలిపారు."ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగినది దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. 23వ తేదీన మరుసటి రోజే మేమందరం కూర్చున్నాం. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చాలు చాలు అని చెప్పడం ఇదే మొదటిసారి. ముగ్గురు చీఫ్‌లు ఏదో ఒకటి చేయాలని చాలా స్పష్టంగా ఉన్నారు. 'ఏం చేయాలో మీరే నిర్ణయించుకోండి' అనే స్వేచ్ఛ ఇచ్చారు. మొదటిసారి విశ్వాసం, రాజకీయ దిశానిర్దేశం, రాజకీయ స్పష్టత చూడడం ఇదే. అదే మా మనోధైర్యాన్ని పెంచుతుంది" అని చెప్పారు."25వ తేదీన నార్తర్న్ కమాండ్‌ను సందర్శించాం. అక్కడ మేం తొమ్మిది లక్ష్యాలను నాశనం చేశాం. చాలా మంది ఉగ్రవాదులను మట్టుబెట్టాం. ఏప్రిల్ 29న మేం మొదటిసారి ప్రధానమంత్రిని కలిశాము. ఆపరేషన్ సిందూర్? అనే చిన్న పేరు మొత్తం దేశాన్ని ఎలా కలుపుతుందో ముఖ్యం. అది మొత్తం దేశాన్ని ఉత్తేజపరిచిన విషయం. అందుకే మీరు ఎందుకు ఆగిపోయారని మొత్తం దేశం అడుగుతోంది? దానికి తగినంత సమాధానం ఇచ్చాం" అని జనరల్ ఉపేంద్ర ద్వివేది తెలిపారు.

# ప్రియుడిని ఇంటికి పిలిచి భర్తతో కలిసి హత్య చేసిన మహిళ



**లక్నో:** ఒక మహిళకు పొరుగింటి వ్యక్తితో వివాహేతర సంబంధం ఉన్నది. అయితే ఆ ప్రియుడ్ని తన ఇంటికి ఆమె పిలిచింది. భర్తతో కలిసి దారుణంగా హింసించి హత్య చేసింది.ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆ మహిళ, ఆమె భర్తను అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో ఈ సంఘటన జరిగింది. రయీస్ అహ్మద్, సితార భార్యాభర్తలు. పొరుగింటికి చెందిన 45 ఏళ్ల అనీష్‌కు సితారతో వివాహేతర సంబంధం ఉన్నది.కాగా, శనివారం రాత్రి అనీష్‌ను తన ఇంటికి రమ్మని సితార పిలిచింది. అక్కడకు వచ్చిన అతడిపై భర్త రయీస్ అహ్మద్‌తో కలిసి దాడి చేసింది. స్క్రూడ్రైవర్‌తో పొడిచి, కటింగ్ ప్లయర్ వంటి పరికరాలతో అతడ్ని హింసించారు. తీవ్ర గాయాలతో అక్కడి నుంచి తప్పించుకుని తన ఇంటికి వచ్చిన అనీష్ ఆ తర్వాత చనిపోయాడు.మరోవైపు అనీష్ మృతిపై అతడి తండ్రి ముస్తాకిమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పొరుగింటి కుటుంబానికి తన కుమారుడు గతంలో ఏడు లక్షలు అప్పు ఇచ్చినట్లు తెలిపాడు. అనీష్‌కు పెళ్లి కుదరడంతో డబ్బు తిరిగి ఇవ్వమని అడిగేందుకు పొరుగింటికి వెళ్లాడని చెప్పాడు. అయితే ఆ దంపతులు దారుణంగా హింసించి తన కుమారుడ్ని హత్య చేశారని ఆరోపించాడు.కాగా, అనీష్ మృతిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అనీష్‌కు సితారతో వివాహేతర సంబంధం ఉన్నట్లు దర్యాప్తులో తెలిసిందని పోలీస్ అధికారి తెలిపారు. ఈ నేపథ్యంలో అనీష్‌ను తన ఇంటికి రప్పించి భర్తతో కలిసి హింసించి హత్య చేసిందని చెప్పారు. భార్యాభర్తలను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు


# డిప్యూటీ సీఎం 2 ఓటరు ఐడీలు కలిగి ఉన్నారన్న తేజస్వి యాదవ్ క్లారిటీ

**బీహార్ :** రాజకీయాలు రోజురోజుకు రసవత్తరంగా మారుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ, ఓటరు జాబితా సవరణ విషయంలో మరో కొత్త వివాదం వెలుగులోకి వచ్చింది. ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్.. బీహార్ డిప్యూటీ సీఎం, బీజేపీ నేత విజయ్ కుమార్ సిన్హాపైసంచలన ఆరోపణలు చేశారు. విజయ్ సిన్హా రెండు ఓటరు ఐడీ కార్డులుకలిగి ఉన్నారని, ఇది ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధమని తేజస్వి ఆరోపించారు. ఒక వ్యక్తికి ఒకే ఓటరు ఐడీ ఉండాలని ఎన్నికల కమిషన్ స్పష్టంగా చెబుతోందనే విషయాన్ని గుర్తు చేశారు.రెండు ఓటరు ఐడీలు, రెండు వయసులుతేజస్వి యాదవ్ ఈ రోజు జరిగిన ప్రెస్ మీట్‌లో దీని గురించి ప్రస్తావించారు. డిప్యూటీ సీఎం విజయ్ సిన్హా రెండు ఓటరు ఐడీ కార్డులు కలిగి ఉన్నారని, అవి రెండు వేర్వేరు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఉన్నాయని చెప్పారు. అంతేకాదు, ఈ రెండు కార్డుల్లో సిన్హా వయసు కూడా వేర్వేరుగా ఉందట.బంకీపూర్ సెగ్మెంట్‌లో ఒక ఓటరు ఐడీలో సిన్హా వయసు 60 కాగా, లఖిసరాయ్‌లో మరో ఐడీలో 57 అని ఉందని తేజస్వి వెల్లడించారు. ఇది ఎలా సాధ్యం? సిన్హా రెండు



ఐడీల కోసం సంతకం చేశారా? లేక ఎన్నికల కమిషన్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియే మోసమా? అని తేజస్వి ప్రశ్నించారు.రెండు జాబితాల్లో..లఖిసరాయ్ అసెంబ్లీలో ఓటరు ఐడీ నంబర్ 3939337, బంకీపూర్‌లో0853341. జనవరి ఓటరు జాబితాలో బంకీపూర్‌లో సిన్హా పేరు ఉంది. బూత్ లెవెల్ ఆఫీసర్ లఖిసరాయ్‌కి వెళ్లినప్పుడు సంతకం చేశారు. బంకీపూర్‌కి వెళ్లినప్పుడు మళ్లీ సంతకం చేశారు. అందుకే రెండు జాబితాల్లో ఆయన పేరు ఉందని తేజస్వి వివరించారు. ఒకవేళ ఎన్నికల కమిషన్‌ప్రక్రియలో మోసం జరుగుతోందా? లేక డిప్యూటీ సీఎం మోసం చేస్తున్నారా? ఆయనపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని తేజస్వి డిమాండ్ చేశారు.సిన్హా కౌంటర్విజయ్ సిన్హా వెంటనే తేజస్వి ఆరోపణలకు స్పందించారు. మా కుటుంబం గతంలో బంకీపూర్ అసెంబ్లీ ప్రాంతంలో ఉండేది. తన పేరును బంకీపూర్ ఓటరు జాబితా నుంచి తొలగించమని అప్లై చేసినట్లు చెప్పారు. తర్వాత లఖిసరాయ్ జాబితాలో పేరు చేర్చుకున్నట్లు వెల్లడించారు. రెండు జాబితాల్లో తన పేరు ఉన్న విషయం తెలిసిన వెంటనే, బంకీపూర్ నుంచి తొలగించమని అభ్యర్థించినట్లు స్పష్టం చేశారు.

# సహాయక చర్యలకు అడ్డుపడిన వాన వందలాది మంది ఆచూకీ తెలిసేనా



**ఉత్తరాఖాండ్:** ఉత్తరాఖాండ్‌లో వర్ష బీభత్సం కొనసాగుతోంది. ఉత్తరకాశీలోని ధరాలి లో వరదలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు చేపట్టిన రెస్క్యూ ఆపరేషనకు వరుణుడు అంతరాయం కలిగించాడు. దాంతో, ఆరో రోజు సహాయక చర్యలు చేపట్టడంలో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దాంతో, వందలాది మంది ఆచూకీ తెలుసుకోవడం గగనంగా మారింది. అయితే.. ఇప్పటివరకూ రెస్క్యూ టీమ్స్ 1,000 మందిని రక్షించాయని ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధాము తెలిపారు. గాయపడిన వాళ్లకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని ఆయన వెల్లడించారు.ఊహించని వరద ప్రవాహం, కొండచరియలు విరిగిపడడంతో ఉత్తరకాశీలోని ధరాలీలో వందలాది మంది గల్లంతయ్యారు. శిథిలాల కింద పలువురు చిక్కుకుపోయారు. జల విలయంతో అల్లాడిపోయిన ఈ ప్రాంతం నుంచి ఐదుగురిని సురక్షింతంగా బయటకుతీసుకొచ్చాయి రెస్క్యూ బృందాలు.వర దధాటికి ఎక్కడికక్కడే చిక్కుకుపోయిన పర్యటకులను కాపాడేందుకు రంగంలోకి దిగిన భారత సైన్యం 33 సైనిక హెలికాప్టర్లను ఉపయోగించి 195 మంది ప్రజలను.. కొండచరియలు విరిగిపడిన చోట చిక్కుకుపోయిన దాదాపు 200 మంది టూరిస్టులను కాపాడిందని సమాచారం. వరద ప్రభావిత ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని జిల్లా సమాచారా అధికారి చెబుతున్నారు. హర్సిల్, ముఖ్వాతో పాటుఉఉ ధరాలిలోని పలు ప్రాంతాల్లో నీళ్లు, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్టు ఆయన పేర్కొన్నారు.

# కాంగ్రెస్ బాధ్యతాయుతంగా ప్రవర్తించడం లేదు : మాజీ అంబాసిడర్ ఫాబియన్

**న్యూ ఢిల్లీ :** ఆపరేషన్ సిందూర్‌పై నిరంతరం ప్రశ్నలు లేవనెత్తుతూ ప్రభుత్వంపై విమర్శల దాడి చేస్తున్న కాంగ్రెస్ పార్టీపై మాజీ రాయబారి కేపీ ఫాబియన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బాధ్యతాయుతంగా ప్రవర్తించడం లేదని, విషయాన్ని లోతు గా అర్థం చేసుకోవడం లేదని విమర్శించారు. ఆపరేషన్ సిందూర్‌పై ఎయిర్‌ఫోర్స్ చీఫ్ ఏపీ సింగ్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పలు ప్రశ్నలు లేవనెత్తింది. ఈ సందర్భంగా మాజీ దౌత్యవేత్త ఫాబియన్ మాట్లాడుతూ యుద్ధం మూడు నెలల కిందట ముగిసిందన్నారు. ఈ వివాదం పీవోకేను విముక్తి చేయడం కాదని.. ఉగ్రవాదులు ఉపయోగిస్తున్న మౌలిక సదుపాయాలపై సర్జికల్ దాడులు చేయడమే లక్ష్యమన్నారు. పాక్ వెళ్లి అమెరికా దగ్గర గోడు వెల్లబోసుకుందన్నారు. ట్రంప్‌ను ప్రధాని విమర్శించాలని కాంగ్రెస్ అంటోందని.. ఇది దౌత్యపరంగా



సరైంది కాదన్నారు. ఓ ప్రభుత్వ అధిపతి.. మరో ప్రభుత్వ అధిపతిపై ఎలాంటి వ్యాఖ్యలు చేయలేరన్నారు.పాకిస్తాన్ డీజీఎంవో కాల్పుల విరమణ కోరిన సమయంలో.. దాన్ని పరిశీలిస్తున్నామని భారత్ ప్రకటన విడుదల చేసి ఉండవచ్చన్నారు. భారత నాయకత్వాన్ని సంప్రదించిన తర్వాత భారత డీజీఎంవో అవునని లేదంటే కాదని సమాధానం ఇచ్చి ఉండాలన్నారు. బెంగళూరులో జరిగిన 16వ ఎయిర్ చీఫ్ మార్షల్ ఎల్ఎం కాత్రే స్మారక ఉపన్యాసం సందర్భంగా మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్‌కు చెందిన ఆరు విమానాలను కూల్చివేసినట్లు తెలిపారు. దాదాపు 300 కిలోమీటర్ల దూరం నుంచి టార్గెట్ చేసినట్లు ఎయిర్ చీఫ్ మార్షల్ తెలిపారు. ఈ విజయం భారత వైమానిక దళ చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయి అని, మన సైనికుల సామర్థ్యానికి నిదర్శనమని ఆయన అన్నారు.ఎస్-400 రక్షణ వ్యవస్థ గేమ్ చేంజర్ వంటిదని.. పాక్ యుద్ధ విమానాలు, మానవ రహిత విమానాలను ఈ వ్యవస్థ బలంగా ఎదుర్కొందని పేర్కొన్నారు. స్పేస్‌లోకి పాక్ చొరబడే అవకాశం ఉండదన్నారు.

# బీజేపీపై బహిరంగ విమర్శలు అధికార ప్రతినిధి బహిష్కరణ



**జైపూర్:** మాజీ ఉప రాష్ట్రపతి జగదీప్ ధంఖర్, మాజీ గవర్నర్ సత్య పాల్ మాలిక్ పట్ల బీజేపీ వ్యవహరించిన తీరును ఆ పార్టీకి చెందిన అధికార ప్రతినిధి బహిరంగంగా విమర్శించారు. ఈ నేపథ్యంలో ఆ పార్టీ ఆయనపై క్రమశిక్షణ చర్యలు చేట్టింది. ఆరేళ్ల పాటు బీజేపీ నుంచి బహిష్కరించింది.బీజేపీ అధికారంలో ఉన్న రాజస్థాన్‌లో ఈ సంఘటన జరిగింది. ఆ రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి కృష్ణ కుమార్ జాను ఇటీవల పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. ఉప రాష్ట్రపతి పదవికి జగదీప్ ధంఖర్ రాజీనామా, ఇటీవల మరణించిన మాజీ గవర్నర్, గతంలో పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడిగా వ్యవహరించిన సత్యపాల్ మాలిక్ పట్ల పార్టీ సీనియర్ నేతలు అవమానకరంగా ప్రవర్తించారని ఆయన ఆరోపించారు. వారిద్దరూ జాట్ వర్గానికి చెందినవారని తెలిపారు. బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ఆఫీస్ బేరర్లను జాను ప్రశ్నించారు. 'సత్యపాల్ మాలిక్‌పై వ్యవహరించిన తీరు సమర్థనీయం కాదు. బీజేపీ నేతలు చేస్తున్నది చాలా విచారకరం' అని అన్నారు.కాగా, ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో అధికార ప్రతినిధి కృష్ణ కుమార్ జానుపై బీజేపీ క్రమశిక్షణ చర్యలు చేపట్టింది. ఆయనను ఆరేళ్ల పాటు పార్టీ నుంచి బహిష్కరించింది. జాను వ్యాఖ్యలపై వివరణ కోరుతూ జూన్ 20న షో కాజ్ నోటీసు జారీ చేసినట్లు బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ చైర్‌పర్సన్ ఓంకార్ సింగ్ లఖావత్ తెలిపారు. 'తన చర్యలను సమర్థించడంలో ఆయన విఫలమయ్యారు. ఆయనను ఆరు సంవత్సరాలు బహిష్కరించాలని కమిటీ నిర్ణయించింది' అని వెల్లడించారు.

# ఓటర్ లిస్ట్‌లో అక్రమాలు సొంత పార్టీ నేతలపై కర్ణాటక మంత్రి ఫైర్



**బెంగళూరు :** లోక్‌సభ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాహుల్ గాంధీ ఇటీవల ఆరోపించిన సంగతి తెలిసిందే. కర్ణాటక లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 16 సీట్లు గెలుస్తుందని ఇంటర్నల్ పోల్స్ అంచనా వేశాయి.. అయితే కాంగ్రెస్‌కు 9 సీట్లు మాత్రమే వచ్చాయని, దీనికి కారణం ఓట్లను చోరీ చేయడమేనని ఆయన ఆరోపించారు. ఈ అంశంపై కర్ణాటక మంత్రి కేఎన్ రాజన్న స్పందిస్తూ.. రాహుల్ గాంధీకి మద్దతు ప్రకటించారు. అదే విధంగా కర్ణాటకలోని సొంత పార్టీ నేతలపై కేఎన్ రాజన్న తీవ్ర ఆగ్రహం వెలిబుచ్చారు.కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాను తయారు చేశారని రాజన్న పేర్కొన్నారు. మరి ఆ ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగితే.. ఆ సమయంలో ఎవరూ ఎందుకు మాట్లాడలేదు..? ఎందుకు మౌనంగా ఉన్నారని కాంగ్రెస్ నేతలను బహిరంగంగా ప్రశ్నించారు. ఓటర్ లిస్ట్‌లో అవకతవకలు జరగడంతోనే మోదీ మరోసారి ప్రధాని పదవి చేపట్టారన్నారు. ఎన్నికల సంఘం లోక్‌సభ ఎన్నికల ఓటరు జాబితాను మార్చిందనేది 100 శాతం నిజం అని స్పష్టం చేశారు. కర్ణాటకలోని మహదేవపుర నియోజకవర్గంలో మోసం జరిగిందన్నారు. ముసాయిదా జాబితా తయారు చేసినప్పుడు, దాన్ని పర్యవేక్షించడం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత కదా..? అని ప్రశ్నించారు. ఈ అక్రమాలన్నీ మన కళ్ల ముందే జరిగాయి. అప్పుడు మౌనం వహించడం సిగ్గుచేటు. ఇలాంటి మోసాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, అప్రమత్తంగా ఉండాలని, రాహుల్ గాంధీ నాయకత్వంలో పటిష్ఠంగా పని చేయాలన్నారు. రాజన్న వ్యాఖ్యలు పార్టీలో అంతర్గత చర్చకు దారి తీశాయి.కర్ణాటకలోని మహదేవపుర నియోజకవర్గంలో లక్షకు పైగా నకిలీ ఓటర్లు, నకిలీ చిరునామాలు, బల్క్ ఓటర్లు ఉన్నట్లు కాంగ్రెస్ పార్టీ దర్యాప్తులో తేలింది. బెంగళూరులోని మహదేవపుర అసెంబ్లీ స్థానంలో 6.5 లక్షల ఓట్లలో లక్షకు పైగా ఓట్ల 'దొంగతనం' జరిగింది. కర్ణాటకలోని అనేక బూత్‌లలో వేర్వేరు రాష్ట్రాలలో ఓటు వేసిన సుమారు 11 వేల మంది ఓటర్లు ఉన్నట్లు గుర్తించాం.ఈ ఓటర్ల పేర్లు, జాబితా మా వద్ద ఉంది అని ఇటీవల రాహుల్ గాంధీ పేర్కొన్న సంగతి తెలిసిందే.

# ఈసీ సంచలన నిర్ణయం జాబితా నుంచి 334 పార్టీల తొలగింపు

**న్యూ ఢిల్లీ :** ఎన్నికల సంఘం ఇటీవల బీహార్‌లో చేపట్టిన ఓట్ల తొలగింపు ప్రక్రియ సంచలనంగా మారింది. ఈసీ అన్యాయంగా ఓట్లను తొలగిస్తుందని విపక్షాలు ఆరోపనలు గుప్పించాయి. ఈసీ బీజేపీ అనుబంధ సంఘంగా పనిచేస్తుందని.. అక్రమాలకు పాల్పడు తుందని రాహుల్ గాంధీ ఆరోపించారు. దీనిపై ఈసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆధారాలు బయటపెట్టాలని సవాల్ విసిరింది. నకిలీ ఓట్లను తొలగించడమే తమ లక్ష్యమని స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే ఈసీ మరో సంచలన నిర్ణయం తీసుకుంది. 334 గుర్తింపు లేని రాజకీయ పార్టీలపై నిషేధం విధించింది. పన్ను మినహాయింపు వంటి ప్రత్యేక హక్కులు, ప్రయోజనాలను పొందుతున్న ఈ పార్టీలు 2019 నుండి ఎన్నికల్లో పోటీ చేయాలనే తప్పనిసరి షరతును పాటించలేవు. దీంతో ఎన్నికల సంఘం రిజిస్టర్డ్ పార్టీల జాబితా నుండి తొలగించింది.ఈ పార్టీలు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల కు చెందినవి. దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు ప్రజాప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 29%ూ%




నిబంధనల ప్రకారం ఈసీఐలో నమోదు చేసుకుంటాయి. ఈ నిబంధనల ప్రకారం.. సదరు రాజకీయ పార్టీ పన్ను మినహాయింపు వంటి కొన్ని ప్రత్యేక హక్కులు, ప్రయోజనాలను పొందుతుంది. అయితే కొన్ని పార్టీలు 2019 నుండి ఏ లోక్‌సభ లేదా రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంత అసెంబ్లీ లేదా ఉప ఎన్నికలలో పోటీ చేయలేవు. దీంతో స్పెషల్ డ్రైవ్ చేపట్టిన ఈసీ అటువంటి 334 పార్టీలను గుర్తించి జాబితా నుంచి తొలగించింది. రాజకీయ వ్యవస్థలో స్వచ్ఛతను తీసుకురావాలనే లక్ష్యంతోనే ఈ చర్య తీసుకున్నట్లు ఈసీ తెలిపింది.షోకాజ్ నోటీసు జారీ.ఈసీ ఉన్నపళంగా ఈ నిర్ణయం తీసుకోలేదు. గత కొన్నాళ్లుగా ఎన్నికల్లో పోటీ చేయని పార్టీలను గుర్తించి షోకాజ్ నోటీసు జారీ చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారులను సీఈసీ ఆదేశించింది. ఆ తర్వాత అన్ని వైపుల నుంచి అభిప్రాయాలను తెలుసుకుంది. చివరకు గత ఆరేళ్లగా 334 పార్టీలు ఒక్క ఎన్నికల్లో కూడా పోటీ చేయలేదని తేల్చి.. జాబితా నుంచి తొలగించింది.30 రోజుల్లోపు అప్పీల్..ప్రస్తుతం దేశంలో 6 జాతీయ పార్టీలు, 67 రాష్ట్ర పార్టీలు, 2854 గుర్తింపు లేని రాజకీయ పార్టీలు ఉన్నాయి. పార్టీలు తమ రిజిస్ట్రేషన్ సమయంలో పేరు, చిరునామా, ఆఫీస్ బేరర్లు మొదలైన వివరాలను అందించాలి. ఏదైనా మార్పులు ఉంటే ఎటువంటి ఆలస్యం లేకుండా కమిషన్‌కు తెలియజేయాలి. తొలగించబడిన గుర్తింపు లేని పార్టీలుచట్టంలోని సెక్షన్ 29 , సెక్షన్ 29 నిబంధనల ప్రకారం ఎటువంటి ప్రయోజనాలను పొందేందుకు అర్హులు కావు. అయితే కమిషన్ యొక్క ఈ నిర్ణయ్ంపై వేటు పడిన పార్టీలు 30 రోజుల్లోపు అప్పీల్ చేసుకోవచ్చు.

# భద్రతా బలగాలు, ఉగ్రవాదులకు మధ్య ఎదురుకాల్పులు



**శ్రీనగర్ :** జమ్మూకశ్మీర్‌లోని కిష్టావర్ జిల్లాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. భారత భద్రతా బలగాలకు, ఉగ్రవాదులకు మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి.కిష్టావర్ జిల్లా దూల్ ఏరియాలో ఉగ్రవాదులు సంచరిస్తున్నట్లు బలగాలకు పక్కా సమాచారం అందింది. ఉగ్రవాదుల కదలికలపై నిఘా పెట్టిన భద్రతా బలగాలు.. ఆ ఏరియాలో కూంబింగ్ నిర్వహించాయి. బలగాల కూంబింగ్‌ను పసిగట్టిన ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దీంతో అప్రమత్తమైన భద్రతా బలగాలు కూడా కాల్పులు జరిపాయి. బలగాలు, ఉగ్రవాదుల మధ్య భీకరమైన ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. ఇద్దరు ఉగ్రవాదులు తలదాచుకున్నట్లు బలగాలు అనుమానిస్తున్నాయి. ఉగ్రవాదులను మట్టుబెట్టేందుకు తమ ఆపరేషన్ కొనసాగుతున్నట్లు ఆర్మీ అధికారులు పేర్కొన్నారు.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI, MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail medaktoday89@gmail.com-cll, 9948265095-9494117870..Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO, TELTEL 2023 ,88524, medaktoday89@gmail.com 9948265095..